ఎన్నాళ్లీ ఎదురుచూపులు!


ఇప్పటూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు

- పంచాయతీలకు అందని బిల్లులు
- పెండింగ్‌లో ఉన్నవి రూ. పదికోట్లకుపైనే

నవాబుపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. దీంతో ఇటీవలే పదవీకాలం పూర్తిచేసుకున్న తాజా మాజీ సర్పంచులు తదితరులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి మురిసిపోయామని.. తీరా పదవికాలం ముగిసిపోయినా బకాయిలు రావడం లేదని వాపోతున్నారు. పనుల కోసం అప్పులు చేసి డబ్బులు తీసుకొచ్చామని.. జాప్యం కొనసాగితే మా పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో... అదిగో అంటూ కాలయాపన చేసిన అధికారులు తాజాగా ..కొత్త సర్కారు కదా కాస్తా ఆలస్యంగా వస్తాయంటూ సమాధానం దాటవేస్తున్నారని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం బకాయిలు ఇస్తుందో లేదో నన్న అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో ఏ మాజీ సర్పంచ్‌ను కదిలించినా అప్పుల బాధలే కనిపిస్తున్నాయి.

పరిస్థితి ఇలా..

మండలంలో మొత్తం 54 పంచాయతీలలో పంచాయితీ రాజ్ శాఖ ద్వారా 24 గ్రామాలు, ఉపాధి పథకంలో 30 గ్రామాలలో పల్లెప్రగతి పనులు చేపట్టారు. కాగా నేటికి చాలా వరకు పంచాయతీలకు బకాయిలు ఇవ్వలేదు.

మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు సంబంధించి పంచాయతీల్లో రూ. 2 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు ఏడాది గడుస్తున్నా బిల్లుల ఊసేలేదు.

సీసీ రోడ్లకు సంబంధించి దాదాపు ప్రతి పంచాయతీలో రూ. 2 నుంచి రూ. 5 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిన్నర కావస్తున్నా ఎవరూ వీటి గురించి మాట్లాడడం లేదు.

అదేవిధంగా పల్లెప్రగతిలో శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. కాగా వీటికి గాను శ్మశాన వాటికకు రూ. 12 లక్షల 60 వేలు, షెడ్లకు సంబంధించి రూ. 2లక్షల 50 వేల వరకు చెల్లించాల్సి ఉంది. కాగా బిల్లులు ఇంకా సగం రావాల్సి ఉంది. కాగా తాజాగా పల్లెప్రగతి పనులపై రాజకీయ దూమారం చెలరేగుతున్న తరుణంలో వాటి ఫైనల్ బిల్లులు అందుతాయో లేదోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా మండలం మొత్తం అన్ని పంచాయతీలకు సంబంధించి దాదాపు రూ. పది కోట్లకు పైగానే బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని తాజా మాజీలు కోరుతున్నారు.

రూ. 25 లక్షలు రావాల్సి ఉంది..



గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 25 లక్షలు రావాల్సి ఉంది. పనులు చేసి ఏడాదిన్నర గడుస్తున్నా అధికారులు స్పందించటం లేదు. పనులు త్వరితగతిన వెంటబడి పూర్తి చేయించినవారు తీరా బిల్లుల విషయం వచ్చేసరికి గ్రామాల వైపు చూడడం లేదు. అప్పులు చేసి మరీ పనులు చేయించాం. ఇప్పటికైనా బిల్లులు చెల్లిస్తే బాగుంటుంది.

– వెంకటేష్, మాజీ సర్పంచ్, జంగమయ్యపల్లి

బిల్లులు చెల్లించాలి..



మేం అధికారంలో ఉన్నప్పటి నుంచి బిల్లుల గురించి అడుగుతున్నా.. అధికారుల నుంచి స్పందన లేదు. తాజాగా మాజీలుగా మారిన అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు. పనుల కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్, నవాబుపేట

అధికారులకు వివరించాం..

గతంలో ఉన్న సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా గ్రామాల తాజా మాజీలు బిల్లుల కోసం రోజూ ఆరాతీస్తున్నారు. విషయం జిల్లా అధికారులకు వివరించాం. పాతబకాయిల వ్యవహారం వచ్చినపుడు బిల్లుల విషయంలో పరిశీలిస్తాం. బకాయిలపై నివేదిక తయారుచేస్తాం.

– శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, నవాబుపేట

క్లుప్తంగా

సెలవు ప్రకటించడం హర్షణీయం



జడ్చర్ల: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించడం హర్షణీయమని గిరిజన సంఘ నాయకులు అన్నారు. ప్రభుత్వ ప్రకటనను అభినందిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగ్యానాయక్, గోపాల్‌నాయక్, పండు, కిషన్, రాజు, సురేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నరేందర్‌జీ

కోయిల్‌కొండ: ట్రస్మా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరేందర్‌జీ, ఉపాధ్యక్షుడిగా కనకయ్య, కార్యదర్శిగా రాంచందర్, కోశాధికారిగా రాజేష్, సంయుక్తకార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, మీడియా ప్రతినిధిగా లాలు, చీఫ్ అడ్వైజర్‌గా వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీడీఓకు సన్మానం



హన్వాడ: మండలంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ ధనుంజయ్‌గౌడ్ సేవలను ప్రజలు గుర్తుపెట్టుకుంటారని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: ఎంపీడీఓ కృష్ణారావు ఆయన సొంత జిల్లా కొమరంభీం ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

దేవరకద్ర: కోయిల్‌సాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ, యూత్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు గోవర్ధన్‌యాదవ్ అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. గ్రామ అధ్యక్షుడిగా నాగిరెడ్డి, యూత్ అధ్యక్షుడిగా మోహన్ తదితరులు ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రశాఖ కమిటీలో చోటు

జడ్చర్ల: ఉదయ సాహితీ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన కమిటీలో పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కృష్ణమోహన్‌కు చోటు దక్కింది. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తనకు అవకాశం కల్పించిన ముఖ్య నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో వీరగురు ఆటో యూనియన్‌లో సభ్యులుగా ఉన్న డ్రైవర్లకు సోమవారం ఎంపీపీ రమాదేవి చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు. మండలంలో 200 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని వారందరికీ కార్డులు ఇచ్చారని నాయకులు తెలిపారు. శ్రీకాంత్‌యాదవ్, రాము, మల్లేశ్, చెన్నారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు యన్మన్‌గండ్ల విద్యార్థి



నవాబుపేట: అండర్ 14 జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు యన్మన్‌గండ్ల జెడ్పీ స్కూల్ విద్యార్థి శివకుమార్ ఎంపికై నట్లు హెచ్‌ఎం వనజ తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు అహ్మదాబాద్‌లో జరిగే అథ్లెటిక్స్‌లో విద్యార్థి పాల్గొంటాడని వివరించారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. పీఈటీ గాయత్రీ తదితరులు ఉన్నారు.

సబ్జెక్టు ఫోరాలకు ప్రశంసలు


బిట్‌బ్యాంక్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో పలు సబ్జెక్టు ఫోరం ప్రతినిధులను కలెక్టర్ రవినాయక్ ప్రశంసించారు. ఈమేరకు ఆయన ఎస్సెస్సీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బిట్ బ్యాంక్‌ను తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సెస్సీ విద్యార్థులకు సులువుగా మార్కులు సాధించేందుకు, భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా బిట్ బ్యాంక్ తయారు చేయడం అభినందనీయమన్నారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు ఈ బిట్ బ్యాంక్ నుంచి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటి విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత సబ్జెక్టు ఫోరం ప్రతినిధులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రాములు, సబ్జెక్టు ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రార్థన చేయించిన ఎంఈఓ


కాకర్లపహాడ్‌లో ప్రార్థన చేయిస్తున్న ఎంఈఓ రాజునాయక్

నవాబుపేట: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ అన్నారు. సోమవారం కాకర్లపహాడ్, రుద్రారం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. కాకర్లపహాడ్‌లో ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులందరూ హాజరుకాకపోవటంతో మందలించారు. స్వయంగా విద్యార్థులతో ప్రార్థన చేయించారు. రుద్రారంలోనూ పాఠశాలలోనూ ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం రుక్కంపల్లి, యన్మన్‌గండ్ల పాఠశాలలను సైతం తనిఖీ చేశారు. సీఆర్‌పీ జనార్దన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే


వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి మూడు రోజులుగా ఇంటింటి సర్వే కొనసాగుతోంది. మొత్తం 49 వార్డులకు గాను 13,252 మంది తమ దరఖాస్తులలో సిలిండర్ వివరాలను సరిగా తెలియజేయలేదు. దీంతో ఈనెల 10 నుంచి ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. తాజాగా సోమవారం 3,942 మంది వివరాలను ఎక్కడికక్కడే అప్‌లోడ్ చేశారు. ఇంకా 1,300 దరఖాస్తుదారులను కలవాల్సి ఉంది. మంగళవారంతో ఈ కార్యక్రమం పూర్తవుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

నీటి ట్యాంకు శుభ్రం చేసేందుకు వెళ్లి..

- గాయపడిన పంచాయతీ కార్మికుడు
- అధికారులకు పంపేందుకు మొబైల్‌లో ఫొటోలు తీస్తుండగా ఘటన


ట్యాంకులో పడిపోయి గాయపడిన నయూమ్

జడ్చర్ల: గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ నీటి ట్యాంకును పరిశుభ్ర పరిచేందుకు వెళ్లిన ఓ పంచాయతీ కార్మికుడు గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు..కోడ్గల్ గ్రామానికి ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకును శుక్రవారం శుభ్ర పరచాల్సి ఉంది. అయితే నీరు నిండుగా ఉండడంతో.. గ్రామ పంచాయతీ కార్మికులు అబ్దుల్ నయూమ్‌తో పాటు మరో ఇద్దరు కార్మికులు సోమవారం శుభ్ర పరిచేందుకు వెళ్లారు. శుభ్రపరిచిన అనంతరం కడిగిన ట్యాంకు ఫొటోలు తీసి అధికారులకు పంపేందుకు అందులోని ఇనుప నిచ్చెన పై ఎక్కారు. మొబైల్‌లో ఫొటోలు తీస్తున్న క్రమంలో అకస్మికంగా నిచ్చెన విరిగి పోయింది. దీంతో నిచ్చెనపై నిలబడి ఉన్న అబ్దుల్ నయూమ్ ట్యాంకు లోపలికి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు అతడిని వైద్య చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

75 ద్విచక్ర వాహనాలు అదుపులోకి..

- సరైన నంబర్ ప్లేట్‌లేకపోవడంతో స్టేషన్‌కు తరలించిన పోలీసులు


అదుపులోకి తీసుకున్న ద్విచక్ర వాహనాలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని పరదేశినాయుడు చౌరస్తాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వన్‌టౌన్ సీఐ భీమ్‌కుమార్, ఎస్‌ఐ శ్రీనయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంట్లో ద్విచక్ర వాహనాలకు సరైన నంబర్ ప్లేట్‌తో పాటు.. పూర్తిగా లేని వాటిని తనిఖీ చేసి 75 వాహనాలు అదుపులోకి తీసుకున్నారు. వాటన్నింటిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సరైన డాక్యుమెంట్స్ తదితరాలు లేకుండా రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళితుల భూమి కాపాడండి

మహబూబ్‌నగర్ రూరల్: అర్బన్ మండల పరిధిలోని సర్వే నెంబర్ 24లో 5 ఎకరాల 34 గుంటల దళితులకు చెందిన భూమిని అక్రమణదారుల నుంచి కాపాడాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేపోగు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు దౌర్జన్యంగా భూమిని కబ్జా చేసి వేరే సర్వే నంబర్‌లో డాక్యుమెంట్స్ చూయించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు ఆపాలని హైకోర్టులో కేసు వేసినట్లు వివరించారు. సర్వే చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కుమార్తెను చూసి వస్తానని వెళ్లి..

- మహిళ అదృశ్యం

జడ్చర్ల: మండల పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. మల్లెబోయిన్‌పల్లికి చెందిన కొమ్ము సంధ్య(33) మహబూబ్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తన కుమార్తెను చూసి వచ్చేందుకు ఈనెల 10న ఇంటినుంచి బయలుదేరి వెళ్లింది. కుమార్తెను కలిసిన అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త కొమ్ము రాములు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

హన్వాడ: దేశ వ్యాప్తంగా ఈ నెల 16న చేసే సమ్మెను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములు, రవి, శంకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసీ సభ్యుడిగా అల్తాఫ్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఆదివారం క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఈసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన అల్తాఫ్ అహ్మద్‌ఖాన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అల్తాఫ్ ప్రస్తుతం జిల్లా క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

మూడోసారి అధికారంలోకి వస్తాం

పాలమూరు: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివార్ లేఖిన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని కొత్తగంజ్, హనుమాన్‌నగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంజయ్య, హరికృష్ణ, బోయ శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులను ఆదుకోవాలి..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి డీడీలు కట్టించుకుని మోసం చేసిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్ అన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా యాదవులను ఆదుకోవాలని కోరారు. గతం ప్రభుత్వం తరహాలో వ్యవహరిస్తే ఆందోళన చేపడుతామని తెలిపారు.

పరీక్షలంటే ఆందోళన వద్దు


సదస్సుకు హాజరైన విద్యార్థులు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ జంగం విశ్వనాథ్

గండేడ్: విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పీయూ సైకాలజీ ప్రొఫెసర్ జంగం విశ్వనాథం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలంటేనే విద్యార్థుల్లో సహజంగా భయం ఉంటుందన్నారు. దీనివల్ల పరీక్షలు అనుకున్న విధంగా రాయలేక ఆశించిన మార్కులు పొందలేకపోతారన్నారు. అందుకే భయం తొలగించుకోవాలన్నారు. ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జనార్దన్, తిరుపతమ్మ.. వివిధ పాఠశాలల పదోతరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్


ఆంజనేయులను అభినందిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న గోరంట్ల ఆంజనేయులు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఓయూ అధ్యాపకులు రామకృష్ణ ఆధ్వర్యంలో 'ఏ స్టడీ ఆఫ్ ప్రొఫెషనలిజం అమాంగ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' అంశంపై ఆయన రీసెర్చ్ చేశారు. వీటితో పాటు పలు సెమినార్లలో పరిశోధన పత్రాలు సమర్పించారు. పలు జర్నల్స్‌లో ఆయన పరిశోధనలు ప్రచురితం అయ్యాయి. కాగా పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు సోమవారం ఆంజనేయులును అభినందించారు. ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ఎంఈడీ ప్రిన్సిపాల్ బషీర్, హెచ్‌ఓడీ జంగం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో మహిళా భక్తులు


తిరుమలలో సేవాకార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన మహిళా భక్తులు

నవాబుపేట: మండల కేంద్రంలోని శివాలయ మహిళ భక్త బృందానికి తిరుమల తిరుపతి దేవాస్థానంలో సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. 15 మంది మహిళలు తిరుమలలో 15 రోజుల పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సోమవారం తిరుమలలో విధులను స్వీకరించారు. గీతారాణీ, నిర్మల, మంగమ్మ, సంగీత, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

బీజేపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

దేవరకద్ర: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్ అన్నారు. సోమవారం దేవరకద్రలోని కొండ ప్రశాంత్‌రెడ్డి నివాసంలో జరిగిన నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి నుంచే కేంద్ర సంక్షేమ పథకాల గురించి బీజేపీతోనే దేశానికి ఉండే ప్రయోజనాల గురించి గ్రామా గ్రామానా ప్రచారం చేయాలని కోరారు. గావ్‌చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమాలు, వాల్ రైటింగ్, బస్సుయాత్ర, రామ మందిర దర్శనం వంటి అంశాలపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేశ్, పాలమూర్ పార్లమెంట్ విస్తారక్ బుడ్డన్న, అసెంబ్లీ విస్తారక్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

యేసు మార్గంలో నడుద్దాం


సమావేశంలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఆచార్య సిలువగంటి

స్టేషన్ మహబూబ్‌నగర్: యేసు మార్గంలో నడుద్దామని హైదరాబాద్‌కు చెందిన ఆచార్య రెవరెండ్ సిలువ గంటి అన్నారు. జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్టలిక్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దైవసేవకుల సహవాసం ఉమ్మడి జిల్లా వేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆచార్య సిలువ గంటి క్రీస్తు సందేశం ఇచ్చారు. యేసు క్రీస్తు నిజమైన రక్షకుడని, ఆ ప్రేమతో మనం జీవించాలని ఐక్యతతో నడుచుకోవాలన్నారు. దేవుడి రాక, క్రీస్తులో దాగివున్న ఏడుదీప స్తంభాల గురించి వివరించారు. ఆయన వాఖ్యానం చేసిన గ్రంథాలను అందజేశారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి 70కిపైగా పాస్టర్లు హాజరయ్యారు. సమావేశంలో దాసరి శామ్యుల్, దాసరి సుందర్, ప్రేమ్‌రాజ్, పీపీ దేవదాస్, విజయ్‌భాస్కర్, మునీందర్, ప్రభాకర్, ఆశీర్వాదం, ఎస్.ప్రకాశ్, సురేష్, రాజారత్నం, తిమోతి యోహాన్, రమేష్, రవికుమార్, జీవన్ అబ్రహం, డీఆర్‌పీ ప్రసాద్, కొండన్న, వీపీఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనైనా న్యాయం చేయండి


సమావేశంలో పాల్గొన్న బాధితులు

జడ్చర్ల: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో సర్వే నంబర్లు 354, 355, 357లలో దాదాపు 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను గత ప్రభుత్వ హయాంలో కొందరు ఆక్రమించుకున్నారని బాధితులు అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తమకు ఎలాగైనా న్యాయం చేయాలని కోరారు. సోమవారం తమ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో సమావేశమయ్యారు. కొన్ని ప్లాట్లలో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి కోసం దరఖాస్తు చేయగా స్థానిక మున్సిపల్ కమిషనర్ తిరస్కరించారని వాపోయారు. సమస్యపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని అన్నారు. బాధితులు మల్లిఖార్జున్, శ్రీను, ఆనంద్, నర్సిములు, జగదీష్, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు


చిన్నరేవల్లి విద్యార్థులతో మాస్టర్ ప్రకాష్ నాయక్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ ఆల్‌స్టైల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ విద్యార్థులు సత్తాచాటారు. షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు మాస్టర్ ఎస్‌కే. మోసీన్ తదితరులు పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, మాస్టర్లు మోసిన్, ఫహిం తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: నల్లగొండలో జేకేఏఐ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చిన్నరేవల్లి విద్యార్థిని ఐషు గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ ప్రకాష్ నాయక్ తెలిపారు. కటాస్ విభాగంలో యేగేశ్వర్ గోల్డ్ మెడల్, మణికంఠ సిల్వర్, ధనుష్ సిల్వర్, తరుణ్, తదితరులు మెడల్స్ సాధించినట్లు వివరించారు. సోమవారం విద్యార్థులను అభినందించారు.

దీర్ఘ కాలిక రుణాలపై దృష్టి సారించాలి

చిన్నచింతకుంట: దీర్ఘకాలిక రుణాలపై అధికారులు దృష్టి సారించాలని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక రుణాలు రికవరీ చేయాలని సూచించారు. అనంతరం సంఘానికి సంబంధించిన ఖాళీ స్థలంలో కొందరు అక్రమంగా హోటళ్లు, డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారని... ఖాళీ చేయించాలన్నారు. నిలిచిన గోదాం నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని తీర్మానం చేశారు. వైస్ ప్రెసిడెంట్ రామలింగారెడ్డి, సభ్యులు నెల్లి శ్రీనివాస్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, గూడూర్ రాములు, సంఘం సీఈఓ బషీర్ పాల్గొన్నారు.